3

# సత్కార్యం

మనమేదో 'అన్నిటికీ కారణం మనమే' ననుకొంటాం. 'మనం న్యాయంగా ఉంటే మిగిలిన వాళ్ళుకూడా న్యాయంగా ఉంటా' రనుకొంటాం. 'సాధ్యమైనంత ధర్మబద్ధంగా జీవించా' లనుకొంటాం. ఏదో అనుకుంటాం. ఏదేదో చెయ్యాలని ఉబలాటపడతాం. అంతేకాదు; వీటిలో చాలావాటిని ఆచరణలో పెట్టడానిక్కూడా ప్రయత్నిస్తాం. కొన్నింటిని అక్షరాలా పాటిస్తాం కూడానూ.

కాని వీటివల్ల వొకొక్కసారి అతిదారుణమైన ఫలితాలు సంభవిస్తాయి. ఒక పని మంచిదో చెడ్డదో చెప్పమంటే మనం చెబుతాం. ఎలా చెబుతాం? ఆ పనివల్ల లభించిన ఫలితాన్ని బట్టి. తేనెచుక్క నాలుకమీద వేసుకొన్నాం. తియ్యగా ఉంది. అది మంచిది. నిప్పుమీద వేలుంచాం. చుర్రుమన్నది. కాబట్టి అది చెడ్డది. కానీ అన్ని వేళలా అన్ని ఫలితాలూ ఇలాగే ఉండవు. కొన్ని సందర్భాలలో ఒక చెడ్డ పనివల్ల సత్ఫలితాలు కలగడమూ, ఒక మంచి పనివల్ల అవతలివాడు నానా గొడవలూ పడడమూ నాకు తెలుసు.

ఒక చిన్న అబద్ధమాడడంవల్ల వేలకువేలు లాభించిన వారున్నారు. చెయ్యకూడని పనిచేసి, లకారాలు గణించిన

వారున్నారు. ఫలితాలనుబట్టే ఒక పని తాలూకు మంచి చెడ్డ లను నిర్ణయించటమంటూ జరిగితే, ఈ లత్కోరు వ్యవహారా లన్నీ చాలా చాలా మంచివనవలసి వస్తుంది.

అలా అనడం న్యాయమా మరి ?

ఎందు కిదంతా చెబుతున్నానంటే, శివరామయ్యకు పెంపకాన్ని గురించి ఏ అభిప్రాయమూ లేనిదశలో, నసపెట్టి అందుకొప్పించినవాణ్ని నేనే! శివరామయ్య సంగతి మీకు తెలీదు. అతగాడు దేనికీ వొకంతట తలూపే రకం కాదు. సాధారణంగా మాట జారడు. అన్న తరువాత హరిహరా దులు అడ్డంవచ్చినా దాన్ని కాదనడు. ఆయన్ని పిసినారని చాలామంది అనడం నాకు తెలుసు. సూటీపోటీగా ఆయన ముఖం మీదనే ఆమాట అన్నవారుకూడా ఉన్నారు. చిత్ర మేమిటంటే, అవేవీ తనను కాదన్నట్టు ఉండేవాడు శివ రామయ్య. అందరితో బాటే తనూ, వోమాట విసిరేవాడు. అందరితో బాటు తనూ నవ్వేవాడు.

'ఇదంతా నిన్ను గురించేనయ్యా' అని అన్నామను కోండి —

'కాదు' అనేవాడు శివరామయ్య. 'నేను పిసినారిని కాదు. యోగ్యుడనేవాడు కనిపించాలేగానీ, తోచింది ఇవ్వడా నికి నాకెప్పుడూ అభ్యంతరంలేదు' అనేవాడు శివరామయ్య.

ఆయన చాలా పేదరికంలో పుట్టాడు. వారాలు చెప్పు కొన్నాడు. దినవస్తులు చేశాడు. యాచించాడు. కష్టపడి

పైకొచ్చాడు. ఈనాటికి ఇంత ఆర్జించాడు. ఎంతహీనంగా చూసుకొన్నా రెండు లకారాల దాకా కూడబెట్టాడు. అయితేనేం ? శివరామయ్యకు భగవంతుడు లోటు చేశాడు. ఆయనకు సంతానం లేదు.

'జీవితంలో ఉన్న పెద్ద విషాదం ఇదేననుకొంటాను. ఏమి తిన్నా అరిగేరోజుల్లో నాకు తిండిలేకుండా పోయింది. తీరా తినడానికి ఇంత ఉండేసమయానికి నేనేమీ తినలేని దుస్థితిలో ఉన్నాను' అనేవాడు శివరామయ్య.

ఆయన కిక సంతతి కలగదని రూఢిగా తెలిశాక దాన్ని గురించిన విచారం మరింతగా పెరిగింది. దాన్ని అందరి దగ్గరా బయటపడేవాడు కాదన్నమాటేగానీ నాదగ్గర దాచుకొనే వాడూ కాడు.

'పోనీ యోగ్యుడైనవాణ్ని చూచి చేరదియ్యక పోయారా ?' అన్నానొకసారి.

శివరామయ్య ఏమీ అనలేదు. తలపంకించి ఊరుకొన్నాడు. అంటే అదేదో నన్నే చూడమన్నాడన్నమాట. ఇదీ ఒకందుకు మంచిదే.... ఆయన్నించి ఆపాటి హామీ పొందాక గానీ నేను చలపతిని కలుసుకోలేదు. శివరామయ్య నాకెంత కావలసినవాడో చలపతికూడా నాకంతే ! అయితే ఇద్దరి స్వభావాలు వేరు. ఇద్దరి పరిస్థితులూ వేరు. అనకూడదుగానీ మా చలపతిది కుచేల కుటుంబం. గంపెడుమంది పిల్లలు. వొచ్చేది వారానికికూడా చాలదు. అతని పొయ్యిలో చాలా రోజుల

పాటు పిల్లి ముడుచుకుని పడుకొంటుంది. అడపా దడపా పాతి కలూ ఏభై లూ నేనే చాలాసార్లు ఇచ్చాను. అయినా అతని దరిద్రం తీరదు. తీరేది కాదు కూడాను.

ఫలానా వాడన్న పేరు చెప్పకుండా నేను చలపతిని అసలు విషయం కదిపిచూశాను.

'నా పిల్లల్లో వొక్కొక్కరిని పదేసి రూపాయలకు అమ్మ డానికి సిద్ధంగా ఉన్నాను. బేరం కుదిర్చిపెట్టు' అన్నాడు చల పతి నవ్వుతూ ....

నెమ్మదిగా అసలు విషయం బయటపెట్టాను.

'మూడోవాణ్ని శివరామయ్య దగ్గర దిగబెట్టు. నే చెప్పానని కాదు. నువ్వూ ఆలోచించు. అందరూ మురిగిపో వలసిన అవసరంలేదు. నీ పిల్లల్లో వొకడు బాగుపడ్డా బాగు పడట్టే! అదీగాక యీ ముడిపడిన తరువాత నువ్వు ఇబ్బంది పడుతుంటే శివరామయ్య చూస్తూ కూచోడు. ఏదోఇవ్వొచ్చు అతన్ని కనిపెట్టుకొని ఉంటే ఆ స్తంతా దక్కుతుంది. నాలుగు డబ్బులు నీకున్నా నీ కొడుక్కున్నా ఫర్వాలేదు.' అన్నాను చలపతితో.

అతను 'సరే' నన్నాడు. ఇష్టం వచ్చినట్టు చెయ్యమ న్నాడు. అటు శివరామయ్యకు కూడా చెప్పవలసినవన్నీ చెప్పాను.

'నీకు మల్లేనే గోపాలం కూడా .... అదే - చలపతి మూడో కొడుకు, లేమిలో పుట్టాడు. లేమిలో పెరుగు

తున్నాడు. వాడికి కష్టాలంటే ఏమిటో తెలుసు. ఉన్నవాణ్ని ఇంకా ఉన్నవాడుగా చేయడంలో అర్థం లేదు. ఒక పేదవాణ్ని ఆదుకొన్నట్టూ ఉంటుంది. ఇటు నీ సమస్యా తీరుతుంది. ఏమంటావ్ ?' అన్నాను.

శివరామయ్య ఏమీ అనలేదు. చెప్పానుగదా, అతను ఇలాంటి సందర్భాల్లో ఏమీ అనడని. ఓ మంచిరోజు చూసుకొని ఆ పని కాస్తా అయిందనిపించాను. ఓ సత్కార్యం చేశానన్న సంతృప్తిపడ్డాను. ఇది జరిగిన కొద్ది రోజులకే నేను బదిలీ అయ్యాను. పది సంవత్సరాలదాకా మళ్ళీ ఆ ప్రాంతాలకు వచ్చే అవకాశం లేకపోయింది. అప్పుడప్పుడూ శివరామయ్యా చలపతీ కూడా ఉత్తరాలు రాస్తూవుండేవారు. ఆ ఉత్తరాలు కూడా లాంఛనంగా మాత్రమే ఉండేవి.

పది సంవత్సరాల తరవాతగానీ మళ్ళా నేను వాళ్ళను కలుసుకొనడం పడలేదు. చలపతిని చూస్తూనే నేను నీరుగారిపోయాను. పదేళ్ళకిందటికన్నా అధ్వానంగా ఉన్నాడతను.

'ఏమిటిదంతా ? ' అన్నాను.

చలపతి నెత్తిబాదుకొన్నాడు.

'వాడి కళ్ళు నడినెత్తి కెక్కాయి. నాలుగు డబ్బులు కనిపించేసరికి మమ్మల్ని మరచిపోయాడు. ఇంటి ఛాయలకు కూడా రానివ్వడు. వాళ్ళమ్మ కూడా చాలాసార్లు వెళ్ళి అడగలేక అడగలేక ఏదన్నా సరమని అడిగింది. నానామాటలూ పడివొచ్చింది. వాడివల్ల నాకేదో వొరుగుతుం దనుకొన్నాను.

అసలు వాడే నాకు దక్కకుండా పోయాడు' అన్నాడు చలపతి.

ఆ సాయంత్రమే శివరామయ్యా గారింటికెళ్ళాను. ఆ మానవుడు నన్ను చూస్తూనే కళ్ళలో నీళ్ళు నింపుకొన్నాడు.

'మూడేళ్ళకిందట నాకు జబ్బు చేసింది. ఎందుకైనా మంచిదని రాత కోతలన్నీ పూర్తి చేశాను. దారి బత్తెమింకా ఉంది. బతికాను. అంతదాకా అణిగిమణిగి పడివున్నవాడు కాస్తా రేగిపోయాడు. రెండుచేతులా ధ్వంసం చేస్తున్నాడు. అటు- పోనీ వాళ్ళనన్నా చూస్తున్నాడా అంటే అదీ లేదు.' అన్నాడు శివరామయ్యా.

అతన్ని ఇంట్లో ఉండవద్దన్నాట్ట. వసారాలో తడికలు అడ్డంకట్టి అక్కడే ఉండమన్నాట్ట. అన్నాట్ట కాదు — శివరామయ్యా అక్కడే ఉన్నాడు.

కారు చప్పుడయింది.

'అదుగో వస్తున్నాడు' అంటూ శివరామయ్యా తడిక లోపలికి తప్పుకొన్నాడు, వొణికిపోతూ.

గోపాలంగాణ్ని నలిపి పారేద్దామని అనుకొన్నాను. కారొచ్చి పోర్టికోలో ఆగింది. గోపాలం ఈలపాట పాడుకొంటూ నా వేపన్నా చూడకుండా లోపలికి వెళ్ళిపోయాడు. అతని వెనకనే కాగితం చుట్టిన రెండు సీసాలు పట్టుకొని డ్రైవరూ వెళ్ళాడు.

శివరామయ్యా కేసి చూశాను. అతని కళ్ళల్లో నీటి పొరలూ చూశాను.